క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బలరామిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: మండలంలోని కురుగొండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గెడి బలరామిరెడ్డి ఇటీవల మృతి చెందారు. గురువారం కర్మక్రియలు నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని బలరామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు వాసుదేవరెడ్డి, వేణురెడ్డి, శ్రీధర్‌రెడ్డిని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాదర్తి హరనాథ్ రెడ్డి, నాయకులు ముమ్మారెడ్డి రవీంద్రరెడ్డి, ఎద్దల శివారెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



సైదాపురం: మండలంలోని కలిచేడు, మలిచేడు, తలుపూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చే కూలీలకు నీడతో పాటు తాగునీటి వసతి కల్పించాలన్నారు. అలాగే పనులు కూడా వేగవంతం చేయాలని సూచించారు.

ఉపాధి పనులు చేపట్టకపోతే చర్యలు

డక్కిలి : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో గుణ శేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 27 పంచాయతీల్లో నిర్దేశించిన పనులను ప్రతి రోజూ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. కూలీలకు సకాలంలో వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈసీ దామోదర్‌రాజు, టీఏలు గిరి, వెంకటయ్య, సరస్వతి పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేయాలి



జడ్జిని సత్కరిస్తున్న కోర్టు సిబ్బంది

చిల్లకూరు : మనో ధైర్యం కలిగి నిబద్ధతతో పని చేస్తే ఎంతటి కష్టమైనా సులువవుతుందని ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. ఆమె గుంటూరు కోర్టుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమెను గురువారం కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ గూడూరు కోర్టులో ఎక్కువ కేసులు పరిష్కరించడం ద్వారా సంతృప్తి కలిగిందన్నారు. వృత్తి పరంగా కలిగే మార్పులకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

జైన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న జైనులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలో వున్న జైన్ దేవాలయంలో గురువారం మహవీర్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ భగవాన్ మహవీర్ తన బోధనల్లో పేదలకు సహాయం చేయాలని పేర్కొన్నారని తెలిపారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కమిటీసభ్యుడు ధర్మీచంద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం దాసరిపల్లి వద్ద గురువారం ప్రయాణికులతో నెల్లూరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొంది. ప్రయాణికులు త్రుటిలో పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సును నడపడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తడ: మండలంలోని అక్కంపేట రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం కదులుతున్న రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. అతనికి సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటాయని తెలిపారు. నీలం రంగు డిజైన్ షర్ట్ మినహా మరే లాంటి ఆధారం లభించలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు తెలిపారు.

చల్ల చల్లగా .. తియ్య తియ్యగా



రూ. 10కే పుచ్చ కాయ జ్యూస్



- జోరుగా పుచ్చకాయల వ్యాపారం
- పోషకాలు పుష్కలమంటున్న వైద్య నిపుణులు
- ఎండలకు ఉపశమనం పొందుతున్న ప్రజలు

ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పది గంటలకే సూర్యుడు భగభగమంటున్నాడు. దీనికితోడు వడగాడ్పులు వీస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోంది. ఎండ వేడిమికి నోరు తడి ఆరిపోతోంది. ఈ క్రమంలో ప్రజలు కూల్ డ్రింకులు, పుచ్చకాయలు, దోసకాయల వైపు చూస్తున్నారు. దీన్ని ఆసరాగా తీసుకున్న సీజనల్ వ్యాపారాలు చేసేవారు దారి పొడవునా పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. కేజీ రూ.10 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. మరికొంతమంది పుచ్చకాయల జ్యూస్‌ను అమ్ముతున్నారు. వ్యాపారం జోరుగా సాగుతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి కాయలను దిగుమతి చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారు.

చిల్లకూరు : గూడూరు నియోజకవర్గంలో కోట, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లో సుమారు 8 వేల ఎకరాలకు పైగా పుచ్చసాగు చేశారు. ఈ ప్రాంతంలో పండిన తొలి పంటను బెంగళూరు వ్యాపారులు కొనుగోలు చేసుకుని వెళుతున్నారు. రూ.10 నుంచి రూ.20 వరకు చెల్లిస్తున్నారు. రెండో పంటను ఇక్కడి వ్యాపా రులు కొనుగోలు చేసుకుని రూ.5ల ఆదాయంతో స్థానిక మార్కెట్లలో విక్రయిస్తున్నారు. పుచ్చకాయలో విటమిన్ బీ, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు మెండుగా ఉండి, కొవ్వు పదార్థం తక్కువగా ఉంటుంది. పుచ్చ గుజ్జు శరీరానికి తక్షణం శక్తిని ఇస్తుంది. 92 శాతం ఆల్కలైన్ నీటితో పాటు పీచు పదార్థం ఉంటుంది. అందువల్ల మూత్ర పిండాలు, మూత్ర నాళాలకు ఉపయోగకారిగా ఉంటుంది. దీన్ని తరచూ తినడం వల్ల మలబద్ధకం దూరం అవుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వృద్ధాప్యం వచ్చే వరకు అంధత్వ సమస్య రాకుండా చేస్తుంది. అందువల్ల పుచ్చకాయలను ఎక్కువగా తింటారు.

ఆరోగ్యంగా ఉండవచ్చు



సీజన్‌లో వచ్చే ఏ ఫలమైనా అవసరమైన మేర తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. వేసవిలో పుచ్చ కాయ, దోస కాయలు తినడం వల్ల ఎండ తీవ్రతను తట్టుకోవచ్చు. పిల్లలు ఎక్కువగా తీసుకుంటే జ్ఞాపనక శక్తి పెరుగుతుంది. మెగ్నీషియం, పొటాషియం ఉండడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు రావు. రక్తపోటు తగ్గుతుంది. షుగర్ ఉన్నవారు కూడా అప్పుడప్పుడూ పుచ్చకాయలు తినొచ్చు.

- కలపాటి శేఖర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యుడు, మోమిడి, చిల్లకూరు మండలం

కాయలను కడప ప్రాంతం నుంచి తెస్తున్నాం



తమిళనాడు ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చి పండ్ల వ్యాపారం చేసుకుంటున్నాం.ఇక్కడి కాయలను బెంగళూరు వ్యాపారులు కొనుగోలు చేసుకెళ్లారు. దీంతో నేను కడప ప్రాంతంలో కాయలు కొనుగోలు చేసి గూడూరు బైపాస్ వద్ద వ్యాపారం పెట్టాను. మా పిల్లలు పుచ్చకాయ జ్యూస్ బండి పెట్టారు. గ్లాస్ రూ.10లకు విక్రయిస్తుండడంతో బాగానే వ్యాపారం అవుతోంది. ఆదాయం కూడా బాగానే ఉంది.

- కుమార్, తమిళనాడు

నేడు మండల సమావేశం

కోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో గోపి తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరకావాలని కోరారు.

13న గురుకులంలో ప్రవేశానికి పరీక్షలు

నాయుడుపేట టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి 13వ తేదీన పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ దాదాపీర్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు 5వ తరగతికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు ఇంటర్‌కు పరీక్షలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని తగిన గుర్తింపు కార్డులతో హాజరుకావాలని కోరారు.

'మోడల్' ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

దొరవారిసత్రం : మండలంలోని మావిళ్లపాడు ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి గాను ఈ నెల 20న నిర్వహించాల్సిన పరీక్ష 21వ తేదీకి మార్చినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సుమలత తెలిపారు. పాఠశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తప్పక హాజరుకావాలని కోరారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

కోట : మండలంలోని తిన్నెలపూడి గ్రామానికి చెందిన వినయ్, క్రిష్ణవేణి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. ఈ క్రమంలో వారు పెళ్లి చేసుకుని గురువారం రక్షణ కల్పించాలని ఎస్‌ఐ పవన్‌కుమార్‌ను ఆశ్రయించారు. పోలీసులు వారి వివరాలు సేకరించి ఇద్దరు మేజర్లని రుజువు కావడంతో పెద్దలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అల్లంపాడులో రీసర్వే పూర్తి

కోట: మండలంలోని అల్లంపాడు రెవెన్యూ పరిధిలో భూముల రీసర్వేను పూర్తి చేసినట్లు తహసీల్దార్ జయజయరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ జనవరిలో ప్రారంభమైన సర్వేలో 821 ఎకరాల్లో సర్వే చేసినట్టు తెలిపారు. ప్రతి పట్టాదారుడికి భూ విస్తీర్ణం కొలతలు నిర్ధారించేందుకు నోటీసులు జారీ చేశామన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే సరిచేస్తామన్నారు. అదే విధంగా ఇలకూరుపాడు రెవెన్యూ విలేజ్ పరిధిలో భూసర్వేను రెండు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. మొత్తం 339 ఎకరాల్లో సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. మండల సర్వేయర్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా రావణ సేవ

కోట: గూడలి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రావణ సేవ చేపట్టారు. సంగమేశ్వరున్ని, కామాక్షీదేవిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు కొడవలూరు ధనుంజయరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

చిట్టమూరు : ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ తెలిపారు. మల్లాం పరిధిలోని సోమసముద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. వేడి పదార్థాలను ప్లాస్టిక్ కాగితాలు, ప్లేట్లలో తినడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు.

పది రోజులుగా తాగునీటికి కటకట

చిట్టమూరు : తీర ప్రాంతంలోని కుమ్మరిపాళెంలో పది రోజులుగా తాగునీరు అందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి తాగునీరు అందించే పైపులైన్ గేట్ వాల్వు దెబ్బతినింది. దాన్ని సరిచేసేందుకు తవ్వారు. తర్వాత దాని గురించి అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో పది రోజుల నుంచి గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో నీటిని తోడుకుని తాగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గేట్ వాల్వుకు మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



రాపూరు: గర్భిణులతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్లు

రాపూరు: గర్భిణులు ఆకుకూరలు, కూరగాయ లు, పండ్లు తదితర పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, రాజ్యలక్ష్మి తెలిపారు. వారు గురువారం తెగచర్ల, తానంచర్ల గ్రామాల్లో నిర్వహించిన పోషన్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులకు వెయ్యిరోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన నాటి నుంచి మంచి ఆహారం తీసుకోవాలన్నారు. తద్వారా కడుపులో ఉన్న బిడ్డ ఎదుగుదల బాగుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు అలేఖ్య, కమల, హెల్పర్‌లు శ్యామలమ్మ, ఎంఎల్‌పీహెచ్ లక్ష్మీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్త హీనతకు చెక్

చిల్లకూరు : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మహిళల్లో రక్త హీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ తెలిపారు. చిల్లకూరు మిక్స్‌డ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు.

పెద్దిరెడ్డితో నేదురుమల్లి, మేరిగ భేటి



పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేదురుమల్లి, మేరిగ

వెంకటగిరి రూరల్ : మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని గురువారం ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. వెంకటగిరి మున్సిపాలిటీలో జరిగిన అవిశ్వాస తీర్మానంపై చర్చించారు.

అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులు

చిట్టమూరు : మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు కోరారు. వారు గురువారం ఎస్‌ఐ చిన బలరామయ్యకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కొంతమంది ఎక్స్, యూట్యూబ్‌లో పలు అసభ్యకర పోస్టులు పెట్టడంతో పాటు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతమ్మపైనా పోస్టులు పెట్టారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ దువ్వూరు లోకేష్‌రెడ్డి, వాకాడు సోషల్ మీడియా కన్వీనర్ లోక కళ్యాణరెడ్డి, ఆశ, మధు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చిట్టమూరు : సమస్యల పరిష్కారం కోసం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చే వారి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ తెలిపారు. ఆయన గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి పూర్తయ్యే వరకు చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. మండల పరిషత్ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు జనార్ధన్, మురళీ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కారానికి కృషి



విష్ణువర్ధన్‌ను సత్కరిస్తున్న బొమ్మిడి శ్రీనివాసరావు

గూడూరు రూరల్ : రాష్ట్రంలో ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ ముదిరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్ తెలిపారు. నాయుడుపేట నుంచి నెల్లూరు వెళుతున్న ఆయనను గురువారం గూడూరు రూరల్ పోటుపాళెం కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ గూడూరు పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసరావు ముదిరాజ్, పలువురు నాయకులు కలిశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థిక, విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో బోనం శేషగిరిరావు ముదిరాజ్, పాము రవికుమార్ ముదిరాజ్, పెరుమాళ్ల వీరన్న ముదిరాజ్, మనిమేల రాజేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపులో దివ్యాంగులకు తప్పని తిప్పలు



పడిగాపులు పడుతున్న దివ్యాంగులు



వైద్యశాల ఆవరణలో వేచి వున్న దివ్యాంగులు

- మధ్యాహ్నం 2.45 గంటల వరకు హాజరుకాని డాక్టర్
- ఆకలితో అలమటించిన పింఛనుదారులు



నడవలేని స్థితిలో ఆటోలోనే ఉన్న దివ్యాంగుడు

నాయుడుపేట టౌన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పింఛను తీసుకుంటున్న దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించుకోవాలని ఆదేశించింది. ఇందులో భాగంగా సూళ్లూరు పేట మండలంలోని దివ్యాంగులను గురువారం నాయుడుపేటలోని సీహెచ్‌సీకి రావాలని పేర్కొంది. ఉదయం 9 గంటలకే దివ్యాంగులు ట్రామాకేర్ సెంటర్ వద్దకు చేరుకున్నారు. వారికి కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. పరీక్షలు చేసే ప్రభుత్వ వైద్యులు జయగోపాల మధ్యాహ్నర 2.45 గంటల వరకు రాలేదు. దీంతో దివ్యాంగులు ఆకలితో అలమటించారు. అక్కడి నుంచి బయటకు వెళితే డాక్టర్ వచ్చి వెళ్లిపోతారేమోనని ఆందోళన చెంది అక్కడే ఉండిపోయారు. దివ్యాంగులు పడుతున్న కష్టాలను చూసిన వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు సెల్ ఫోన్‌లో డాక్టర్‌ను సంప్రదించినా ఫలితం లేదు. చివరికి డాక్టర్ 2.45 గంటల తర్వాత కేంద్రానికి చేరుకున్నారు. దీనిపై డీసీహెచ్‌ఎస్ మూర్తిని వివరణ కోరగా విచారించి డాక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ చంద్రకళ సమాచారం ఇవ్వకపోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగనన్నకు బహుమతిగా మున్సిపల్ విజయం



మాట్లాడుతున్న నేదురుమల్లి

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి మున్సిపాలిటీలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి సాధించిన విజయాన్ని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇచ్చినట్టు ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం సాక్షితో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిందన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి దొడ్డి దారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని కాజేయాలని చూసిన కూటమి నేతలకు వెంకటగిరి కౌన్సిలర్లు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. తమ పార్టీ గుర్తుపై గెలిచిన 25 మంది కౌన్సిలర్లలో ఆరుగురిని లాక్కున్నారని, మిగిలిన 19 మంది ఏకతాటిపై నిలిచారని గుర్తు చేశారు. నిజాయితీ, విశ్వాసనీయత వైపు నిలిచిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం సమష్టి విజయమన్నారు. త్వరలో 19 మంది కౌన్సిలర్లు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవనున్నట్లు తెలిపారు. వెంకటగిరిలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేయాలని చూస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వివరించారు. కూటమి ప్రభుత్వానికి వెంకటగిరిలో మున్సిపాలిటీ నుంచి తొలి దెబ్బ ఎదురైందన్నారు. జమిలి ఎన్నికలు రావడం ఖాయమని, మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఇకనైనా టీడీపీ చేస్తున్న అరాచకాలు మానుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



వెంకటగిరి రూరల్ : వెంకటగిరి ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



రాపూరులో గేట్‌మీటింగ్ నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు



గూడూరు ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న నేతలు

వెంకటగిరి రూరల్/రాపూరు/గూడూరు రూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ వెంకటగిరి, రాపూరు, గూడూరు ఆర్టీసీ డిపోల నాయకులు కేవీ రత్నం, పీవీ రామారావు, నిస్సార్ అహ్మద్, భాస్కర్, హరిబాబు, అహ్మద్, ప్రవీణ్, శ్రీనివాసులు, కృష్ణ డిమాండ్ చేశారు. వారు గురువారం ఉద్యోగులతో కలిసి ఆర్టీసీ డిపోల వద్ద గేట్ మీటింగ్, ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన 1/2019 సర్క్యులర్‌ను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ నిలుపుదల చేయాలన్నారు. నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి రూ.400లకు పెంచాలని కోరారు. ప్రమోషన్లు వెంటనే చేపట్టాలన్నారు. మహిళా కార్మికులకు పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెంకటగిరికి చెందిన ఎస్‌డీపీ రజక్, బాషా, కృష్ణారెడ్డి, భాస్కర్, రాజా, శివకుమార్, గూడూరుకు చెందిన ప్రవీణ్, గౌస్ శేఖర్, అచ్యుత రావు, మస్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం



విశేషాలంకరణలో హుస్సేనమ్మ దర్గా

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లిలో హుస్సేమ్మ దర్గా వద్ద గురువారం రాత్రి గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి హుస్సేనమ్మకు బెల్లం, కర్జూర్, శనగలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎస్‌ఐ అజయ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



తడ: అనారోగ్యంతో బాధపడుతున్న కొండూరుకు చెందిన బీటెక్ విద్యార్థి మీంజూరు దినేష్‌కి యూటీఎఫ్‌కు చెందిన ఉపాధ్యాయులు గురువారం రూ.55 వేలు అందజేశారు. పేద కుటుంబానికి చెందిన దినేష్ చదువులో చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదువుతున్నాడు. గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు చెన్నై విజయ, అపోలో ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తున్నారు. అతనికి గుండె మార్పిడి చేయాలని, రూ.60 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఈ విషయాన్ని సీఆర్పీ గోపి ద్వారా తెలుసుకున్న తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాలకు చెందిన యూటీఎఫ్ ఉపాధ్యాయులు రూ.55 వేలు సేకరించి బాధితునికి అందజేశారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ గోపి

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని కయ్యూరుకండ్రిగ గ్రామం, వేణుగోపాలపురం గిరిజన కాలనీలో గురువారం విద్యుత్ షాక్‌తో మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం.. గిరిజన కాలనీకి చెందిన నాగరాజ భార్య పోలూరు దేశమ్మ (38) బట్టలు ఉతికి ఇంట్లోనే ఉన్న తీగపై ఆరేస్తోంది. ఆ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో ఆమె షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందింది. ఘటనా స్థలానికి ఎస్‌ఐ గోపి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.